సాక్షి

పశ్చిమగోదావరి

శుక్రవారం । 10 । జనవరి । 2025



వేద విద్యార్థి ఆత్మహత్య

టీటీడీ వేద పాఠశాలలో వేద విద్యను అభ్యసిస్తున్న కైకలూరు మండలం భుజబల పట్నంకు చెందిన బాలుడు ఆత్మహత్య చేసుకోవడం కలకలం రేపింది. 12లో ▸



సంక్రాంతి సంబరం

ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లావ్యాప్తంగా పలు పాఠశాలలు, కళాశాలల్లో గురువారం సంక్రాంతి వేడుకలు అట్టహాసంగా నిర్వహించారు. 12లో ▸



బాస్కెట్‌బాల్ సందడి

నూజివీడు ఈనెల 11 నుంచి జరిగే బాస్కెట్‌బాల్ క్రీడా సంబరానికి వేదిక కానుంది. ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచి 45 జట్లు తలపడనున్నాయి. 12లో ▸

న్యూస్‌రీల్

సంప్రదాయాలకు ప్రతీక సంక్రాంతి



సంక్రాంతి సంబరాల్లో కలెక్టర్

భీమవరం (ప్రకాశం చౌక్): సంప్రదాయాలకు ప్రతీక సంక్రాంతి అని కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. గురువారం కలెక్టరేట్‌లోని ఖజానా శాఖ కార్యాలయంలో ఏర్పాటుచేసిన బొమ్మల కొలువును ఆమె ప్రారంభించారు. రంగవల్లులు, బొమ్మల కొలువులను పరిశీలించి జిల్లా ట్రెజరీ అధికారి ఆడారి గణేష్‌ను అభినందించారు. బుద్ధిని వృద్ధి చేసుకోవడం సంక్రాంతి పండుగలో ఆంతర్యం అని కలెక్టర్ అన్నారు. మూడు రోజులపాటు ట్రెజరీ కార్యాలయంలో పండుగ సంబరాలు నిర్వహించనున్నారు. వంటలు, ముగ్గులు, క్రీడా పోటీలు నిర్వహిస్తామని అధికారులు తెలిపారు.

టెన్త్‌లో నూరు శాతం ఉత్తీర్ణత సాధించాలి

భీమవరం: పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో నూరు శాతం ఉత్తీర్ణత సాధించడంతోపాటు జిల్లాను రాష్ట్రంలో ప్రథమ స్థానం నిలిపేందుకు సమష్టిగా కృషి చేయాలని కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. స్థానిక ఎస్‌ఆర్‌కేఆర్ కళాశాలలో గురువారం విద్యాశాఖ ఆధ్వర్యంలో భీమవరం డివిజన్ స్థాయిలో విద్యాశాఖ అధికారులు, ప్రధానోపాధ్యాయులతో ఆమె సమావేశం నిర్వహించారు. ఎస్‌ఏ–1 పరీక్షల ఉత్తీర్ణత శాతాన్ని అనుసరించి పక్కా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని, ప్రత్యేక తరగతులను సమర్థంగా నిర్వహించాలన్నారు. విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం పెంపొందించేలా కృషిచేయాలన్నారు. డీఈఓ ఈ.నారాయణ, సర్వశిక్ష అభియాన్ అడిషనల్ ప్రాజెక్టు కో–ఆర్డినేటరు పి.శ్యామ్ సుందర్, కమ్యూనిటీ మొబిలైజేషన్ అధికారి వైచం ద్రశేఖర్, డివైఈఓ పి.నాగరాజు పాల్గొన్నారు.

చార్జీలు పెంచితే సహించం



టి.ఉమామహేశ్వర రావు, డీటీసీ

భీమవరం (ప్రకాశం చౌక్): సంక్రాంతి పేరు చెప్పి ప్రైవేట్ ట్రావెల్స్ చార్జీలు పెంచి వసూలు చేస్తే సహించమని జిల్లా రవాణా శాఖ అధికారి టి.ఉమామహేశ్వరరావు హెచ్చరించారు. గురువారం ఆయన తన కార్యాలయంలో మాట్లాడుతూ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్లతో వాహనాల తనిఖీకి చర్యలు తీసుకున్నామన్నారు. జిల్లాలో తాడేపల్లిగూడెం, తణుకు ప్రాంతంలో ఓ బృందం, భీమవరం, పాలకొల్లు ప్రాంతంలో మరో బృందం తనిఖీలు చేస్తుందన్నారు. అధిక చార్జీలు వసూలు చేసినట్టు నిర్ధారిస్తే రూ.10 వేల జరిమానా విధిస్తామన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే వాహనాలను సీజ్ చస్తామన్నారు.

గణతంత్ర వేడుకలకు ఎంపిక



రాహిణిని అభినందిస్తున్న దృశ్యం

పెంటపాడు: కేంద్ర ప్రభుత్వం వీర్‌గాథ 4.0 కార్యక్రమంలో భాగంగా అలంపురం గ్రామంలోని సరస్వతి విద్యాలయ విద్యార్థి జవ్వాది రాహిణి ఎంపికైంది. గురువారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ఎంఈఓలు టీవీఆర్‌కే, ఎం.శ్రీనివాస్ మాట్లాడుతూ రాహిణి రూ.10 వేల నగదు బహుమతితో పాటు ఈనెల 26న ఢిల్లీలో జరిగే గణతంత్ర వేడుకల్లో పాల్గొంటుందని చెప్పారు. పాఠశాల చైర్మన్ కొలనువాడ హనుమసత్యనారాయణరాజు (వెంకట్), డీఈఓ నారాయణ, సహాయ కో–ఆర్డినేటర్ శ్యాంసుందర్, ఎంఈఓలు ఆమెను అభినందించారు.

జాతీయ సైన్స్‌ఫేర్‌కు ఏనుగువానిలంక టీచర్



ట్రోఫీతో ఉపాధ్యాయుడు ముద్దల

యలమంచిలి: విజయవాడలో జరిగిన రాష్ట్ర స్థాయి సైన్స్‌ఫేర్‌లో ఏనుగువానిలంక ఉపాధ్యాయుడు ముద్దల శ్రీరామాంజనేయరావు ప్రదర్శించిన కొబ్బరి వ్యర్థాలతో విద్యుత్ తయారీ పరికరం జాతీయస్థాయి పోటీలకు ఎంపికైంది. త్వరలో పాండిచ్చేరిలో జరిగే జాతీయస్థాయి పోటీలకు శ్రీరామాంజనేయరావు అర్హత సాధించారని ప్రధానోపాధ్యాయుడు ఎస్ఎస్‌వీ అవధాని తెలిపారు.

నేత్రపర్వం.. గిరి ప్రదక్షిణం





అశేష జనవాహిని నడుమ గిరి ప్రదక్షిణ, శేషవాహనంపై కొలువైన ఉత్సవమూర్తులు (ఇన్‌సెట్‌లో)

వేంకటరమణా.. గోవిందా.. శ్రీనివాసా.. గోవిందా.. నామస్మరణలు మార్మోగాయి. ద్వారకాతిరుమలలో చినవెంకన్న గిరి ప్రదక్షిణ మహోత్సవం అట్టహాసంగా జరిగింది. దేవస్థానం ఈఓ వేంద్ర త్రినాథరావు, అనువంశిక ధర్మకర్త ఎస్వీ నివృతరావు శేషవాహనంపై కొలువైన చినవెంకన్నకు ప్రత్యేక పూజలు నిర్వహించి రథం ముందు బలిహరణ సమర్పించారు. అనంతరం గిరి ప్రదక్షిణ ప్రారంభమైంది. అశేష భక్తజనవాహని నడుమ కోలాట నృత్యాలు, విచిత్ర వేషధారణలు, నాటిక ప్రదర్శనలతో ఐదు కిలోమీటర్ల మేర రథంతో గిరి చుట్టూ తిరిగారు. పాదయాత్ర క్షేత్రం నుంచి దొరసానిపాడు, రాళ్ల కుంట రహదారి మీదుగా కొండపైకి, అక్కడి నుంచి ఉగాది మండపం మీదుగా తిరిగి ఆలయానికి చేరుకుంది. మాజీ ఈఓ దంతులూరి పెద్దిరాజు, దేవస్థానం అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

- ద్వారకాతిరుమల

మున్సిపాలిటీలో కీచక అధికారి!

- భీమవరంలో మహిళా ఉద్యోగుల పేరిట మంత్రికి ఫిర్యాదు
- లైంగికంగా వేధిస్తున్నారని ఆరోపణలు
- విచారణకు ఆదేశించిన మహిళా కమిషన్, ఉన్నతాధికారులు
- మున్సిపల్ కమిషనర్ ఆధ్వర్యంలో ప్రత్యేక కమిటీతో విచారణ
- నాలుగు నెలల్లో రిటైర్ కానున్న సదరు అధికారి



భీమవరం మున్సిపల్ కార్యాలయం ముఖద్వారం

సాక్షి, భీమవరం: భీమవరం మున్సిపల్ కార్యాలయంలో మహిళా ఉద్యోగులపై ఓ అధికారి లైంగిక వేధింపులు చర్చనీయాశంగా మారాయి. తమ పట్ల అనుచితంగా ప్రవర్తిస్తున్నారంటూ మహిళా ఉద్యోగుల పేరిట మున్సిపల్ శాఖ మంత్రి పి.నారాయణ, మహిళా కమిషన్‌కు ఫిర్యాదులు అందాయి. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు విచారణ జరుగుతుండగా వివరాలిలా ఉన్నాయి.

పెద్దరికం నటిస్తూ దురాలోచనలు

మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ తర్వాత కీలక బాధ్యతలు నిర్వర్తిస్తున్న ఓ అధికారిపై ఈ ఫిర్యాదులో పలు ఆరోపణలు చేశారు. గతంలో పలువురు అధికారుల వద్ద పనిచేశామని, ఎప్పుడూ లేని ఇబ్బందిని ఎన్నికల తర్వాత బదిలీపై వచ్చిన ఓ అధికారి నుంచి ఎదుర్కొంటున్నామని మహిళా ఉద్యోగులు పేర్కొన్నారు. అధికారం అడ్డం పెట్టుకుని పైకి పెద్దరికం నటిస్తూ దురాలోచనలు చేస్తున్నారని, తమను పేర్లతో కాకుండా బుజ్జి, చిన్నారి, బంగారం, పాప అంటూ పదేపదే పిలుస్తూ తాకుతుంటారని, సంతకాల కోసం ఒంటరిగా ఆయన చాంబర్‌కు వెళ్లినప్పుడు వ్యక్తిగత విషయాలు మాట్లాడుతూ అనుచితంగా ప్రవర్తిస్తుంటారని, ఇంటికి వెళ్లాక కూడా ఫోన్లు చేసి విసిగిస్తుంటారని ఆరోపించారు. శానిటేషన్ ఫీల్డ్ విజిట్ పేరుతో మహిళా సెక్రటరీలను వారి స్కూటీపై ఎక్కించుకుని తీసుకువెళ్లమంటారని, తన చాంబర్‌కు వచ్చి పనిచేయాలని ఒత్తిడి చేస్తుంటారని, ఆయన వేధింపులు భరించలేక ఓ ఉద్యోగిని సెలవు పెట్టి వెళ్లిపోయారని ఫిర్యాదు చేశారు. సమస్యను కొందరు అధికారుల దృష్టికి తీసుకువెళ్లగా గతంలో ఆయన పనిచేసిన పలుచోట్ల ఇదే తరహాలో మహిళా ఉద్యోగులను వేధింపులకు గురిచేసినట్టుగా చెప్పారని పేర్కొన్నారు. గతంలో ఆయన భీమవరంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేసిన సమయంలో మావుళ్లమ్మ గుడి వీధికి చెందిన మహిళ పట్ల అసభ్యంగా ప్రవర్తించడంతో స్థానికులు దేహశుద్ధి చేశారని, తాడేపల్లిగూడెంలో ఒక మహిళా వర్కర్‌ను వేధించడంతో ఆమె అందరి ముందు చెప్పుతో కొట్టినట్టుగా తమకు తెలిసిందని మహిళా ఉద్యోగులు ఫిర్యాదులో తెలిపారు.

కొనసాగుతున్న విచారణ

ఉద్యోగినుల ఫిర్యాదుపై మహిళా కమిషన్‌తో పాటు ఉన్నత వర్గాల నుంచి మున్సిపల్ కమిషనర్ పి.రామచంద్రారెడ్డికి ఆదేశాలందాయి. ఈ మేరకు ఐదుగురు మున్సిపల్ కార్యాలయ మహిళా ఉద్యోగులతో ప్రత్యేక కమిటీని ఏర్పాటుచేశారు. మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ ఎన్.విశ్వచైతన్య అధ్యక్షురాలిగా ఏర్పాటుచేసిన కమిటీలో ఏఏఓ ఎ.బాలసుబ్రహ్మణ్యేశ్వరి, డబ్ల్యూపీఎస్ పి.కీర్తి, జూనియర్ అసిస్టెంట్ కె.శిరీష, అటెండర్ పీవీ కనకదుర్గ సభ్యులుగా ఉన్నారు. మున్సిపల్, సచివాలయ, శానిటరీ విభాగాల్లో 240 మంది వరకు మహిళా ఉద్యోగులు పనిచేస్తుండగా మూడు రోజులుగా 140 మందిని విచారించినట్టు కమిటీ సభ్యులు తెలిపారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, సచివాలయ ఉద్యోగులను వేర్వేరుగా పిలిచి మాట్లాడుతుండటంతో సమయం పడుతోందని, సంక్రాంతి తర్వాత మిగిలిన వారితో మాట్లాడతామని చెప్పారు. ఆరోపణలు ఎదుర్కొంటున్న అధికారిని కూడా వివరణ ఇవ్వాలని కోరామన్నారు. ఇదిలా ఉండగా సదరు అధికారి మరో నాలుగు నెలల్లో రిటైర్ కానున్నట్టు తెలిసింది.

విచారణ అనంతరం నివేదిక

ఓ అధికారి లైంగికంగా వేధిస్తున్నారన్న ఆరోపణలపై ఉన్నతస్థాయి ఆదేశాల మేరకు ప్రత్యేక కమిటీతో విచారణ జరిపిస్తున్నాం. కమిటీ ఇచ్చిన నివేదిక, సదరు అధికారి వివరణను ఉన్నతాధికారులకు నివేదిస్తాం.

–పి.రామచంద్రారెడ్డి, మున్సిపల్ కమిషనర్, భీమవరం

సీఎం, డిప్యూటీ సీఎం రాజీనామా చేయాలి

మాజీ మంత్రి కొట్టు డిమాండ్



తాడేపల్లిగూడెం: తిరుపతిలో టోకెన్ టికెట్ల కౌంటర్ల వద్ద జరిగిన ఘటనకు నైతిక బాధ్యత వహిస్తూ సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, టీటీడీ ఈఓ బాధ్యత వహించి రాజీనామా చేయాలని మాజీ మంత్రి కొట్టు సత్యనారాయణ డిమాండ్ చేశారు. తాడేపల్లిగూడెంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ తొక్కిసలాటలో ఆరుగురు భక్తులు మృతి చెందడంపై తీవ్రంగా మండిపడ్డారు. ఈ ఘటన అత్యంత దారుణమని, తిరుపతి చరిత్రలోనే ఇలాంటి ఘటన జరగలేదని చెప్పారు. ఇది ఆలయ పాలకవర్గం, కూటమి ప్రభుత్వం పూర్తి వైఫల్యానికి నిదర్శనమని అన్నారు. తిరుమల తిరుపతిలో ఉండే అడ్మినిస్ట్రేషన్ దేశంలోనే గొప్పదన్నారు. అటువంటి వ్యవస్థను అయోధ్యలో ఏర్పాటుచేసేలా సర్వే చేశారని చెప్పారు. అయితే అలాంటి వ్యవస్థను కూటమి ప్రభుత్వం నిర్వీర్యం చేసిందన్నారు. గత ఐదేళ్లలో దేవదాయ శాఖను అభివృద్ధి చేశామని, పలు సంస్కరణలు చేసిన ఘనత కూడా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. లోకేష్, టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు దళారీ వ్యవస్థను ఏర్పాటు చేశారనీ విమర్శించారు. తొక్కిసలాట లో ఆరుగురు దుర్మరణం చెందారని, దీనికి ఎవరూ సమాధానం చెబుతారని, సనాతన ధర్మం కోసం మాట్లాడే పవన్ కల్యాణ్ ఏం సమాధానం చెబుతారని కొట్టు నిలదీశారు.

ముక్కోటికి భద్రత కట్టుదిట్టం



తాత్కాలిక క్యూలైన్ల వద్ద రూట్ మ్యాప్‌ను పరిశీలిస్తున్న జిల్లా ఎస్పీ ప్రతాప్ శివకిషోర్



దేవస్థానంలో శ్రీవారి నిజరూప దర్శనానికి పోటెత్తిన భక్తులు

- ద్వారకాతిరుమలలో ప్రత్యేక బందోబస్తు
- నేడు ఉదయం 5 గంటల నుంచి శ్రీవారి ఉత్తర ద్వార దర్శనం

ద్వారకాతిరుమల: తిరుపతిలో వైకుంఠ ఏకాదశి టోకెన్ల జారీలో జరిగిన తొక్కిసలాట నేపథ్యంలో ఏలూరు జిల్లా పోలీస్ శాఖ అప్రమత్తమైంది. ద్వారకాతిరుమల చిన వెంకన్న క్షేత్రంలో శుక్రవారం ఉదయం 5 గంటల నుంచి జరుగనున్న శ్రీవారి ఉత్తర ద్వార దర్శనంపై ప్రత్యేక దృష్టి సారించింది. ఏలూరు, నూజివీడు సబ్ డివిజన్లలోని పోలీస్‌స్టేషన్ల నుంచి 120 మంది సిబ్బందితో ప్రత్యేక బందోబస్తు ఏర్పాటుచేశారు. దేవస్థానం వద్ద ఏర్పాట్లను గురువారం రాత్రి జిల్లా ఎస్పీ ప్రతాప్ శివకిషోర్ పరిశీలించారు. దేవస్థానం అధికారులు, డీఎస్పీ శ్రావణ్‌కుమార్, భీమడోలు సీఐ యూజే విల్సన్, ద్వారకాతిరుమల ఎస్సైలకు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా జాగ్రత్తలు చేపట్టాలని సూచించారు.

సర్వం సిద్ధం : శుక్రవారం ఉదయం 5 గంటల నుంచి శ్రీవారి ఉత్తర ద్వార దర్శనాన్ని నిర్వహించేందుకు దేవస్థానం అధికారులు ఏర్పాట్లు పూర్తిచేశారు. ఉత్తర ద్వారాన్ని, స్వామివారు ఆశీనులయ్యే ప్రాంతాన్ని పచ్చిపూలతో అలంకరించే పనులు అర్ధ రాత్రి వరకు సాగాయి. అలాగే వెండి గరుడ, శేష వాహనాలను సిద్ధం చేశారు.

రాత్రికే చేరుకున్న భక్తులు : ఉత్తర ద్వార దర్శనం కోసం పలు ప్రాంతాల నుంచి వేలాది మంది భక్తులు, గోవింద స్వాములు రాత్రికే క్షేత్రానికి చేరుకున్నారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారి నిజరూప దర్శనం చేసుకున్నారు.

పశువధను ఆపలేవా ఆరిమిల్లీ?

మాజీ మంత్రి కారుమూరి ధ్వజం



టీడీపీ హయాంలోనే అనుమతులు వచ్చాయని చూపిస్తున్న మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు

తణుకు అర్బన్: లాహం ఫుడ్ ప్రొడక్ట్స్ పేరుతో తణుకు మండలం తేతలిలో పోలీసులను కాపలాగా పెట్టి స్థానిక ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ పశువధ శాలను యథేచ్ఛగా నడిపిస్తున్నారని మాజీ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు విమర్శించారు. స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో గురువారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పశువధశాలకు కారుమూరి హయాంలోనే అనుమతులు వచ్చాయంటూ డైవర్షన్ చేస్తున్నావే కానీ పశువధశాలను మూయిస్తావా మూయించలేవా అనే విషయం ప్రజలకు నేరుగా చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. పశు వధశాల అక్రమంగా నడుస్తోందని తెలిసి కూడా నిమ్మకు నీరెత్తినట్టుగా ఉన్నావంటే నీకు ఉత్తరప్రదేశ్ నుంచి వచ్చిన డబ్బే ముఖ్యమా అని నిలదీశారు. డబ్బే ముఖ్యమైతే తణుకువాసుల వద్ద చందాలు వసూలు చేసి నీకిస్తామని, పశు వధశాలను మూయించాలని విజ్ఞప్తి చేశారు. పశు వధకు వ్యతిరేకమంటావు.. పోరాడే వారిపై బైండోవర్ కేసులు, లాయర్ నోటీసులు ఇప్పిస్తావు.. పోలీస్ యాక్టులు పెట్టి నిరసన దీక్షను పోలీసులతో తొలగింపచేశావు.. అంటూ మండిపడ్డారు. తనపై బురద చల్లడం మాని పశువధపై ఎమ్మెల్యే ధోరణి మార్చుకోవాలని సూచించారు. మహిళలు, కార్మికులు రోదిస్తున్నా ఎమ్మెల్యేకి పట్టడం లేదన్నారు. తాను ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో గోసేవా సమితి సభ్యులు పోరాటం చేస్తే ఫ్యాక్టరీకి తాళం వేయించానని కారుమూరి గుర్తుచేశారు.

రాష్ట్రవ్యాప్తంగా ఫ్యామస్ అయ్యావు

పశువధను ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఎమ్మెల్యేగా, మద్యం సిండికేటులో పావలా వాటా ఎమ్మెల్యేగా రాష్ట్రవ్యాప్తంగా నువ్వు ఫ్యామస్ అయ్యావంటూ ఎమ్మెల్యే రాధాకృష్ణను మాజీ మంత్రి కారుమూరి ఎద్దేవా చేశారు. తాను మంత్రిగా ఉన్న సమయంలో చెత్త తదితర అంశాలపై టిక్‌టాక్‌లు, రీల్స్ చేశారని, ఇప్పుడు రోడ్లపై ఉన్న ఆ చెత్త పైనా, పశువధ పైనా రీల్స్ చేస్తే అందరూ చూసి తరిస్తారని మండిపడ్డారు. ఎమ్మెల్యే రాధాకృష్ణ పుణ్యమా అని తణుకులో రోడ్లపై ఉండే ఆవులు సైతం కనిపించడం లేదని స్పష్టం చేశారు.

అవసరమైతే జగనే వస్తారు

తణుకు వాసులను పశువధ నుంచి విముక్తి చేసేందుకు ఎంతవరకు అయినా వెళ్తానని, త్వరలో ఎమ్మెల్సీ, ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా రీజనల్ కో–ఆర్డినేటర్ బొత్స సత్యనారాయణ, మాజీ మంత్రి అంబటి సత్యనారాయణ తణుకు వస్తారని, ఇంకా అవసరమైతే తమ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కూడా వచ్చి బాధితులకు అండగా నిలుస్తారని కారుమూరి అన్నారు. పశువధ ప్రాంత జట్టు కూలీలు మాట్లాడుతూ రెండు నెలలుగా కర్మాగారంలోకి పశువులు వెళ్తుండటం చూస్తున్నామని, దుర్వాసనతో భోజనాలు చేయలేకపోతున్నామని వాపోయారు. వైఎస్సార్‌సీపీ నేత చినిమిల్లి వెంకటరాయుడు, సీనియర్ న్యాయవాది వెలగల సాయిబాబారెడ్డి, వైఎస్సార్‌సీపీ పబ్లిసిటీ వింగ్ జిల్లా అధ్యక్షుడు జల్లూరి జగదీష్, తేతలి మాజీ సర్పంచ్ కోట నాగేశ్వరరావు, వి.సీతారాం, చింతన్న తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన దేహదారుఢ్య పరీక్షలు

- మొత్తంగా 3,453 మంది కానిస్టేబుల్ అభ్యర్థుల హాజరు
- 1,975 మంది ఎంపిక



పరుగు పోటీలో మహిళా అభ్యర్థులు



లాంగ్ జంప్ చేస్తున్న అభ్యర్థి

ఏలూరు టౌన్: ఏపీ పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు చేపట్టిన కానిస్టేబుళ్ల నియామక ప్రక్రియ గురువారంతో ముగిసింది. ఏలూరు పోలీస్ పరేడ్ గ్రౌండ్స్‌లో గత నెల 30 నుంచి దేహదారుఢ్య పరీక్షలకు అభ్యర్థులు భారీ సంఖ్యలో హాజరయ్యారు. ఏలూరు జిల్లా ఎస్పీ కొమ్మి ప్రతాప్ శివకిషోర్ పర్యవేక్షణలో ప్రశాంతంగా ముగిశాయి. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా పరిధిలో 4,976 మంది అభ్యర్థులకు హాల్‌టికెట్లు జారీ చేయగా దేహదారుఢ్య పరీక్షలకు 3,453 మంది హాజరయ్యారు. వారిలో 1,975 మంది అభ్యర్థులు ఎంపికైనట్టు ఎస్పీ శివకిషోర్ చెప్పారు. జిల్లా అదనపు ఎస్పీ నక్కా సూర్యచంద్రరావు, ఏఆర్ అదనపు ఎస్పీ శేఖర్, తూర్పుగోదావరి ఎస్పీ ఎల్.చెంచిరెడ్డి, ఎస్‌బీ సీఐలు మల్లేశ్వరరావు, బి.ఆదిప్రసాద్, ఏఆర్ ఆర్ఐ పవన్‌కుమార్, పోలీసు అధికారులు దేహదారుఢ్య పరీక్షలను సక్రమంగా నిర్వహించడంలో సమర్థవంతంగా పనిచేశారు.

నారా పాలనలో నరబలి తప్పదా!

మాజీ మంత్రి కారుమూరి

తణుకు అర్బన్: నారా చంద్రబాబునాయుడు పరిపాలనలో నరబలి తప్పదని మరోసారి రుజువైందని మాజీ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు ధ్వజమెత్తారు. తణుకు వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ తిరుపతిలో జరిగిన తొక్కిసలాటలో ఎన్నడూ లేనివిధంగా ఆరుగురు భక్తులు అసువులు బాసిన ఘటన బాధాకరమని అన్నారు. వైకుంఠ ద్వార దర్శనం కోసం టోకెన్లు తీసుకునేందుకు వెళ్లిన భక్తుల మధ్య తొక్కిసలాట జరిగిందంటే భద్రతా లోపం ఏమేరకు ఉందో అర్థమవుతోందని చెప్పారు. గతంలో రాజమండ్రి పుష్కరాల్లో సైతం చంద్రబాబు తన ప్రచార ఆర్భాటం కోసం 29 మంది భక్తులను బలి తీసుకున్న వ్యవహారాన్ని ఈ సందర్భంగా కారుమూరి గుర్తుచేశారు. ఇటీవల రాజమండ్రిలో ఒక సినిమా రిలీజ్ ఫంక్షన్‌కు వచ్చిన ఇద్దరు యువకులు సైతం రోడ్డు ప్రమాదంలో మృత్యువాత పడటం దారుణమని అన్నారు. తిరుమల తిరుపతి లడ్డూ ప్రసాదాన్ని వివాదం చేయాలని కూటమి నేతలు ప్రయత్నించారని, ఇటువంటి దుష్ప్రచారాల కారణంగానే అమాయక భక్తులు అసువులు బాస్తున్నారని ఆయన విమర్శించారు. టీటీడీ ఒక ప్లానింగ్, పద్ధతి లేకుండా ఇష్టానుసారంగా వ్యవహరించడం కారణంగానే తొక్కిసలాట వంటి ఘటనలు చోటుచేసుకుంటున్నాయని స్పష్టం చేశారు. తిరుపతి తొక్కిసలాట ఘటనకు పూర్తిగా ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, బీజేపీ నేతలు బాధ్యత వహించాలన్నారు. మృతుల కుటుంబాలకు న్యాయం చేయాలని ఈ సందర్భంగా కారుమూరి డిమాండ్ చేశారు.

క్లుప్తంగా

ఏపీ క్రాస్ కంట్రీ జట్టు కోచ్‌గా సంకు, మేనేజర్‌గా కేతా


సంకు సూర్యనారాయణ, కోచ్


కేతా మునీంద్రరావు, మేనేజర్

తణుకు అర్బన్ : ఆంధ్రప్రదేశ్ క్రాస్ కంట్రీ జట్టుకు కోచ్‌గా మండపాక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ సంకు సూర్య నారాయణ, మేనేజర్‌గా వేల్పూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కేతా మునీంద్రరావులను ఆంధ్రప్రదేశ్ అథ్లెటిక్ అసోసియేషన్ నియమించింది. ఈనెల 12న ఉత్తరప్రదేశ్‌లోని మీరట్‌లో నిర్వహించే జాతీయస్థాయి క్రాసకంట్రీ పోటీల్లో పాల్గొనే ఏపీ జట్టుకు వీరు కోచ్, మేనేజరుగా వ్యవహరించనున్నారు. ఈ సందర్భంగా వారిని పలువురు అభినందించారు.

చెల్లని చెక్కు కేసులో జైలు శిక్ష, జరిమానా

నూజివీడు: చెల్లని చెక్కు కేసులో నిడమానూరుకు చెందిన వేగి బేబీ సరోజినికి ఆరు నెలల జైలు శిక్ష, రూ.35 లక్షల జరిమానా విధిస్తూ నూజివీడులోని స్పెషల్ మేజిస్ట్రేట్ వేల్పుల కృష్ణమూర్తి గురువారం తీర్పును వెలువరించారు. కృష్ణాజిల్లా బాపులపాడు మండలం ఏ సీతారామపురంనకు చెందిన మయూర పూర్ణ చంద్రరావు బేబీ సరోజినికి 2015, 2016, 2017 సంవత్సరాల్లో మూడు దఫాలుగా రూ.30 లక్షలు అప్పుగా ఇచ్చారు. కొంతకాలం తరువాత బాకీ తీర్చమని పూర్ణచంద్రరావు అడగగా 2017లో బేబీ సరోజిని ఒక్కొక్కటి రూ.10 లక్షలు చొప్పున మూడు చెక్కులు ఇచ్చింది. వాటిని బ్యాంకులో వేయగా బేబీ సరోజని ఖాతాలో నగుదు లేదని చెక్కులు వెనక్కు వచ్చాయి. దీనిపై పూర్ణచంద్రరావు కోర్టులో కేసు వేయగా విచారణ అనంతరం బేబీ సరోజినికి స్పెషల్ మేజిస్ట్రేట్ జైలుశిక్ష, జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు.

మద్యం తరలిస్తున్న ముగ్గురి అరెస్ట్


అక్రమంగా మద్యం తరలిస్తున్న ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేసిన దృశ్యం

భీమవరం : కారులో అక్రమంగా మద్యం తరలిస్తున్న ముగ్గురు వ్యక్తులను అరెస్ట్ చేసినట్లు ఎక్సైజ్ సీఐ కె బలరామరాజు తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. కారులో మద్యం తరలిస్తున్నట్లు సమాచారం అందడంతో బుధవారం రాత్రి పోలీసులు భీమవరం ఎస్ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్ కళాశాల వద్ద కారును తనిఖీ చేసి, 25 మద్యం సీసాలను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. మద్యం తరలిస్తున్న కొమ్మిశెట్టి వెంకటేశ్వర్లు, కొలపర్తి వెంకటేశ్వర రావు, కంచుస్తంభం కాశేశ్వరరావులను అరెస్టు చేసినట్లు సీఐ చెప్పారు. కాగా ఖరీదైన మద్యం సీసాల్లో లోకల్ మద్యం వేసినట్లు ప్రాథమికంగా గుర్తించి మద్యాన్ని రసాయన పరీక్షల కోసం కాకినాడు ల్యాబ్‌కు పంపించినట్లు తెలిపారు. ఈ దాడిలో ఎస్‌టీఎఫ్ ఇన్‌స్పెక్టర్ పీబీ సత్యనారాయణ, బలరామరాజు, ఎస్సై సునీల్‌కుమార్ పాల్గొన్నారు.

ఉరి వేసుకుని మహిళ ఆత్మహత్య

భీమవరం: భీమవరం రెండో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధి రాయలం గ్రామానికి చెందిన ఎ.రవీంద్రకుమారి (37) ఫ్యానుకు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. గొల్లవాని తిప్పరోడ్డులోని ప్రకాష్‌నగర్‌కు చెందిన ఆమె గత 15 రోజులుగా రాయలంలో అద్దె ఇంట్లో నివసిస్తోంది. మృతురాలు తండ్రి కృష్ణ చేసిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై మోహన్ తెలిపారు.

సంక్రాంతి సంబరం.. సంస్కృతికి దర్పణం


పెనుగొండ : భోగి మంటల వద్ద చిన్నారుల సందడి

భోగిమంటల వెలుగులు.. దూదూబసవన్నల విన్యాసాలు.. పాలపొంగళ్ల ఘుమఘుమలు.. గొబ్బెమ్మల పాటలు.. బొమ్మల కొలువులు.. సంక్రాంతి ముందే వచ్చిందా అన్నట్టు సంబరాలు జరిగాయి. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లావ్యాప్తంగా పలు పాఠశాలలు, కళాశాలల్లో గురువారం సంక్రాంతి వేడుకలు అట్టహాసంగా నిర్వహించారు. చిన్నారులు, మహిళలు సంప్రదాయ వస్త్రధారణలు, నృత్యాలతో ఆకట్టుకున్నారు.

– సాక్షి నెట్‌వర్క్


ఏలూరు సీఆర్ రెడ్డి పబ్లిక్ స్కూల్‌లో బసవన్నలకు పూజలు చేస్తున్న దృశ్యం


భీమవరం: విష్ణు స్కూల్లో భోగిమంటను వెలిగిస్తున్న విష్ణురాజు


తణుకు అర్బన్: గొబ్బెమ్మల వద్ద నృత్యాలు చేస్తున్న విద్యార్థినులు


ఏలూరు సీఆర్ రెడ్డి పబ్లిక్ స్కూల్‌లో నృత్యం చేస్తున్న ఉపాధ్యాయినులు

నూజివీడులో బాస్కెట్‌బాల్ సందడి

- ఈనెల 11న 48వ జాతీయస్థాయి బాస్కెట్‌బాల్ టోర్నమెంట్ ప్రారంభం
- పోటీల్లో పాల్గొనేందుకు వివిధ ప్రాంతాల నుంచి 45 జట్లు రాక
- డీఏఆర్ కళాశాల క్రీడాప్రాంగణంలో రెండు కోర్టులు సిద్ధం

నూజివీడు: జమిందారుల పాలనకు నెలవైన పురాతన పట్టణం నూజివీడులో ఈనెల 11 నుంచి 14వ తేదీ వరకు బాస్కెట్‌బాల్ క్రీడా సంబరానికి వేదిక కానుంది. 48 ఏళ్ళుగా ఆక్రో బాస్కెట్ బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏటా ఇక్కడ జరిగే పోటీల నిర్వహణకు ధర్మ అప్పారావు (డీఏఆర్) కళాశాలలో అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. పురుషులు, మహిళ విభాగంలో జరిగే ఈ పోటీలకు రెండు తెలుగు రాష్ట్రాల్లోని వివిధ ప్రాంతాల నుంచి 45 జట్లు తమ ఎంట్రీలను నమోదు చేసుకున్నాయి. పురుషుల విభాగంలో 30 జట్లు, మహిళల విభాగంలో 15 జట్లు తలపడనున్నాయి. పోటీల నిర్వహణకు బాస్కెట్‌బాల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియాకు చెందిన 20 మంది రిఫరీలు రానున్నారు. స్థానికంగా ఉన్న పట్టణ ప్రముఖులు, క్రీడామానులు తదితరులు నుంచి అందే విరాళాలతో బాస్కెట్‌బాల్ పోటీలను అంతరాయం లేకుండా నిర్వహిస్తున్నారు. లీగ్‌కం నాకౌట్ పద్ధతిలో జరిగే ఈ పోటీలను నిర్వహించడానికి కళాశాల ప్రాంగణంలోని రెండు బాస్కెట్‌బాల్ కోర్టులను సిద్ధం చేశారు. ఫ్లడ్ లైట్ల వెలుగులో రాత్రి,పగలు కూడా పోటీలు నిర్వహించడానికి నిర్వాహకులు ఏర్పాటు చేశారు.


పోటీలకు సిద్ధంగా ఉన్న బాస్కెట్‌బాల్ కోర్టు

ఇదీ నేపథ్యం

మాజీమంత్రి, ఆంధ్ర విశ్వవిద్యాలయం మాజీ ఉపకులపతి, మాజీ రాజ్యసభ్యులైన స్వర్గీయ ఎమ్మార్ అప్పారావు అధ్యక్షునిగా, ఎంఎస్ అప్పారావు కార్యదర్శిగా 1969లో మొట్టమొదటిసారిగా నూజివీడు బాస్కెట్‌బాల్ అసోసియేషన్ ఆవిర్భవించింది. అనంతరం 1971లో తొలిసారిగా డీఏఆర్ కళాశాలలో ఆంధ్రా బాస్కెట్‌బాల్ సంఘం ఆధ్వర్యంలో బాస్కెట్‌బాల్ పోటీలు జరిగాయి. 1973లో ఎంఎస్ అప్పారావు సారథ్యంలో ఆక్రో బాస్కెట్ బాల్ సంఘం ఏర్పాటు కాగా అనంతరం ఈ క్రీడను మరింత అభివృద్ధి చేయాలనే సంకల్పంతో ఎమ్మార్ అప్పారావు నేతృత్వంలో నూజివీడు కేంద్రంగా జిల్లా బాస్కెట్ బాల్ అసోసియేషన్ ఏర్పాటైంది. డీఏఆర్ కళాశాలలో అప్పట్లో బాస్కెట్‌బాల్ శిక్షణను నిర్వహించారు. ఈ శిక్షణలో నూజివీడు ప్రాంతానికి చెందిన వారు బాస్కెట్‌బాల్ నేర్చుకొని జాతీయస్థాయి పోటీల్లో సత్తాచాటారు. ఎందరో క్రీడాకారులు పీఈటీలుగా, పీడీలుగా, రైల్వే ఉద్యోగాల్లో స్థిరపడ్డారు. వీరందరూ నూజివీడులో నిర్వహించే బాస్కెట్‌బాల్ పోటీలకు తమ వంతు సహకారాన్ని అందజేస్తారు.

యువకుడిపై పోక్సో కేసు నమోదు

తాడేపల్లిగూడెం : మైనర్ బాలిక (16)ను మోసం చేసిన యువకుడిపై పోలీసులు కేసు నమోదు చేశారు. పట్టణ ఎస్సై నాగరాజు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణానికి చెందిన ఓ యువకుడు అతని ఇంటి ఎదురుగా నివాసం ఉంటున్న మైనర్ బాలికపై లైంగిక వేధింపులకు పాల్పడ్డాడు. ఈ విషయంపై బాలిక తల్లిదండ్రులకు తెలియడంతో వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. గురువారం పోలీసులు నిందితుడిని అదుపులోకి తీసుకుని పోక్సో, అత్యాచారం కేసు నమోదు చేశారు.

రూ.1.50 లక్షల చోరీపై ఫిర్యాదు

భీమవరం: భీమవరం రెండో పట్టణ పరిధిలో ఆటోలో ప్రయాణిస్తున్న సమయంలో రూ. 1.50 లక్షలు అపహరణకు గురయ్యాయని వి.రామలక్ష్మి అనే మహిళ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ నెల 6న బస్సులో పిప్పర నుంచి భీమవరంలోని ప్రకాశంచౌక్ కూడలిలో దిగానని, అక్కడ్నుంచి ఆటోలో అడ్డవంతెన వరకు వెళ్లి దిగిన తర్వాత కుమార్తె ఇంటికెళ్లాక సంచి చూసుకునే సరికి రూ.1.50 లక్షల నగదు లేదని ఆమె ఫిర్యాదులో పేర్కొంది. కేసు నమోదు చేసి నట్లు హెడ్‌కానిస్టేబుల్ భూషణం చెప్పారు.

వేద పాఠశాలలో బాలుడి ఆత్మహత్య

- కోటప్పకొండలో ఘటన
- తల్లడిల్లుతున్న తల్లిదండ్రులు



కైకలూరు : నిత్యం శివార్చనలో తరిస్తున్న ఆ దంపతులకు చాన్నాళ్లు సంతానం లేదు. యాగాలు, హోమాలు, నోములు, ఉపవాసాల అనంతరం 16 ఏళ్లకు మగ బిడ్డ పుట్టడంతో సాయి శివ సూరజ్ అని పేరు పెట్టుకొని అల్లారుముద్దుగా పెంచుకుంటున్నారు. ప్రాథమిక విద్య అనంతరం వేద పాఠశాలకు పంపారు. విధి కన్నెర్ర చేసిందో ఏమో సూరజ్ తాను విద్యనభ్యసిస్తున్న వేద పాఠశాలలో బుధవారం రాత్రి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఊహించని ఈ ఘటనతో అతని తల్లిదండ్రులు తల్లడిల్లిపోతున్నారు. ఏంటి శివయ్యా.. నువ్వే బిడ్డను ప్రసాదించి.. నీ వద్దకే వాడిని తీసుకుపోయావా.. అంటూ తల్లిదండ్రులు రోదిస్తున్న తీరు చూసి చూపరులు కన్నీటిపర్యంతమయ్యారు.

ఓ తరం వారసుడు అస్తమయం..

కృష్ణాజిల్లా పెడన నియోజకవర్గం బంటుమిల్లి మండలం చిన తుమ్మిడి గ్రామానికి చెందిన కుందుర్తి శివశ్రీ, ఛాయా కుమారి దంపతులు పదేళ్ల క్రితం ఏలూరు జిల్లా కైకలూరు మండలం భుజబలపట్నం లో భీమేశ్వరస్వామి శివాలయంలో అర్చకత్వానికి వచ్చారు. కుమారుడు సాయి శివ సూరజ్ (16)కు కైకలూరు ప్రైవేటు స్కూల్‌లో ప్రాథమిక విద్య నేర్పి, నాలుగేళ్ల క్రితం పల్నాడు జిల్లా నరసారావుపేట సమీప కోటప్పకొండలో తిరుమల తిరుపతి దేవస్థానం ఆధీనంలోని శ్రీ వేంకటేశ్వర వేద పాఠశాలలో చేర్పించారు. ఎనిమిదేళ్ల శైవాగమం కోర్సులో నాలుగేళ్లు పూర్తిచేసిన సూరజ్.. బుధవారం రాత్రి 9–10 గంటల మధ్య వేద పాఠశాల హాస్టల్ గదిలో ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. సూరజ్ తండ్రి శివశ్రీ కూడా ఆ కుటుంబంలో ఒక్కడే కుమారుడు కావడం గమనార్హం. అతనికి ఆరుగురు అక్కచెల్లెళ్లు ఉన్నారు. మొత్తం మీద ఓ తరానికి వారసుడిని కోల్పోవడంతో కుటుంబం మొత్తం గుండెలవిసేలా రోదిస్తోంది. ఎంతో చలాకీగా నవ్విస్తూ, నవ్వుతూ ఉండే సూరజ్ ఆత్మహత్య చేసుకున్నాడంటే నమ్మబుద్ధి కావడం లేదని కైకలూరు పరిసర ప్రాంత పలు అర్చక కుటుంబాల వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.


పల్నాడు జిల్లా కోటప్పకొండ వేద పాఠశాలలో బాలుడు ఆత్మహత్య చేసుకున్న హాస్టల్ గది, (అంతర చిత్రం) మృతుడు సాయి శివ సూరజ్ (ఫైల్)

దోషులను శిక్షించాలి

కుందుర్తి సాయి శివ సూరజ్ బలన్మరణానికి వేద పాఠశాల ప్రిన్సిపాల్ వేధింపులే కారణమని కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. ఈ ఘటనపై ప్రభుత్వం పూర్తి విచారణ చేసి దోషులను కఠినంగా శిక్షించాలని కైకలూరుకు చెందిన ఆదిశైవ అర్చక సంఘం, ఏలూరు జిల్లా జాయింట్ సెక్రటరీ చావలి శంకరశాస్త్రి గురువారం డిమాండ్ చేశారు.

అంతర్జాతీయ స్కేటర్ జెస్సిరాజ్‌కు పురస్కారం

దెందులూరు: ఏలూరు జిల్లా దెందులూరు మండలం జోగన్నపాలెం గ్రామానికి చెందిన స్కేటర్ మాత్రపు జెస్సిరాజ్ రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా పురస్కారం అందుకుంది. ఆమె తల్లిదండ్రులు సురేష్, రాధా గురువారం విలేకరులకు వివరాలు వెల్లడించారు. విజయవాడ ఎస్ఎంఎస్ పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న జెస్సి రాజ్‌కు చిన్ననాటి నుంచి స్కేటింగ్‌పై ఉన్న ఆసక్తిని గమనించి తల్లిదండ్రులు కోచ్ సింహాద్రి వద్ద ఆమెకు శిక్షణ ఇప్పించారు. రాష్ట్ర జాతీయ స్థాయిలో స్కేటింగ్‌లో 50 పథకాలను జెస్సిరాజ్ సాధించింది. ఈ సంవత్సరం ఆసియా కప్ ప్రపంచ కప్ పోటీల్లో సైతం విజయం పతాకం ఎగురవేసింది. న్యూజిలాండ్‌లో జరిగిన ప్రపంచ ఓషియాన పసిఫిక్ కప్ చాంపియన్ షిప్– 2024లో ప్రపంచ క్రీడాకారులను వెనక్కి నెట్టి దేశానికి బంగారు పతకాన్ని సాధించింది. ఆమె ప్రతిభను గుర్తించిన రాష్ట్ర ప్రభుత్వం ప్రధానమంత్రి రాష్ట్రీయ బాల పురస్కార్ – 2025కు సిఫార్సు చేశారు. డిసెంబర్ 26న భారత రాష్ట్రపతి కార్యాలయంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము జెస్సిరాజ్‌కు అవార్డును ధ్రువీకరణ పత్రాన్ని అందజేయగా ప్రధాని నరేంద్ర మోదీ ఆమెను అభినందించారు.


రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతులమీదుగా ప్రశంసా పత్రం అందుకుంటున్న జెస్సిరాజ్ (ఫైల్)

అంతర్ జిల్లాల దొంగల ముఠా అరెస్ట్

భీమడోలు: అంతర్ జిల్లాల దొంగల ముఠాను భీమడోలు పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితుల నుంచి రూ.3 లక్షల చోరీ విలువ గల చోరీ సొత్తును స్వాధీనం చేసుకున్నారు. భీమడోలు పోలీస్‌స్టేషన్‌లో ఏలూరు డీఎస్పీ డి.శ్రావణ్‌కుమార్ గురువారం వివరాలు వెల్లడించారు. సింగరాయకొండ ప్రాంతానికి చెందిన నిందితుడు రంగనాథం కిరణ్, మరో మహిళ ఎల్లుట్ల నారాయణమ్మ, ఆమె కుమారుడు వసంతకుమార్ ఒక ముఠాగా ఏర్పడి రహదారి పక్కనే ఉన్న ఇళ్లను లక్ష్యంగా చేసుకుని దొంగతనాలు చేస్తున్నారు. వారిపై నెల్లూరు జిల్లా గూడూరు పోలీస్‌స్టేషన్‌లో 58 కేసులు నమోదయ్యాయి. అక్కడ నుంచి వచ్చి కైకలూరులో ఓ ఇంటిని అద్దెలో ఉంటూ భీమడోలు, ఉంగుటూరు, నల్లజర్ల, నరసాపురం పోలీస్‌స్టేషన్ల పరిధిలో పలు దొంగతనాలకు పాల్పడ్డారు. దీనిపై ఎస్పీ కె.ప్రతాప్ శివ కిషోర్ ఆదేశాల మేరకు డీఎస్పీ డి.శ్రావణ్‌కుమార్ ఆధ్వర్యంలో సీఐ జోసఫ్ విల్సన్ పర్యవేక్షణలో ఎస్సై వై.సుధాకర్‌తో పాటు హెచ్‌సీలు సూరిశెట్టి శ్రీనివాసరావు, బాబి, కానిస్టేబుల్ వెంకట్ బృందంగా ఏర్పడి నిందితులను భీమడోలు జంక్షన్‌లోని బృందావన హోటల్ దగ్గరలో వారిని పట్టుకున్నారు. రాష్ట్రంలోని పలు జిల్లాల్లో రంగనాథం కిరణ్‌పై 43 కేసులు, నారాయణమ్మపై 8 కేసులు, వసంతకుమార్‌పై 7 కేసులు నమోదయ్యాయి. వారిని అరెస్ట్ చేసి భీమడోలు కోర్టుకు హాజరుపర్చారు. నిందితులను పట్టుకున్న సీఐ యూజే విల్సన్, పోలీసు బృందాన్ని డీఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.


భీమడోలులో వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ డి.శ్రావణ్ కుమార్, సీఐ యూజే విల్సన్, ఎస్సై వై.సుధాకర్

శృంగవృక్షంలో డయేరియా విజృంభణ

- రోజురోజుకూ పెరుగుతున్న కేసులు
- కలుషిత నీరే కారణం అంటున్న ప్రజలు

పాలకోడేరు: మేజర్ పంచాయతీ శృంగవృక్షం గ్రామం ఐదు రోజులుగా డయేరియా కేసులతో అట్టుడుకుతోంది. ప్రతి ఇంటిలోనూ ఒక్కరైనా వాంతులు, విరేచనాలు, కడుపునొప్పితో బాధపడుతున్నారు. పంచాయతీ ఉద్యోగి ఇటీవల ఉపయోగించని రావిచెరువులోని కలుషిత నీటిని పైపుల ద్వారా సరఫరా చేయడంతో ఈ దుస్థితి తలెత్తినట్లు ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇదే విషయంపై గురువారం జరిగిన పంచాయతీ బోర్డ్ సమావేశంలో ఎంపీటీసీ సత్య కృష్ణ, వార్డ్ సభ్యులు సోము దుర్గాభవాని పంచాయతీ కార్యదర్శిని నిలదీశారు. అయితే తనకు తెలియకుండా జరిగిందని బదులిచ్చారు. సదరు ఉద్యోగిని ప్రశ్నిస్తే తప్పయిపోయిందని ఒప్పుకున్నాడు. అయితే కలుషిత నీటి కారణంగా ఇప్పటివరకు నలుగురు మృతి చెందారని, ఈ విషయాలు బయటకు పొక్కకుండా కొందరు ప్రయత్నిస్తున్నట్లు స్థానికులు క్రొవ్విడి దుర్గ తదితరులు ఆరోపిస్తున్నారు. అంతేకాకుండా ఇప్పటికీ ఇదే కలుషిత నీటినే కుళాయిల ద్వారా సరఫరా చేస్తున్నారని వడ్డీల వీధిలోని మహిళలు వాపోతున్నారు. గ్రామంలో పారిశుధ్యం అధ్వానంగా ఉందని, ఎవరూ పట్టించుకోవడం లేదని, వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నా సరిపడ మందులు లేవని కాలనీవాసులు మండిపడుతున్నారు. దీనిపై ఎంపీడీవో వి రెడ్డియ్యను వివరణ కోరగా పంచాయతీ సరఫరా చేసే జలాలు ఎక్కడ కలుషితమవుతున్నాయో పరిశీలించి సురక్షిత నీటిని అందిచేలా చర్యలు చేపడతామని చెప్పారు.


శృంగవృక్షంలోని కలుషిత నీటిని సరఫరా చేస్తున్నారంటూ మహిళల నిరసన



పైపుల ద్వారా మురుగు నీరు వస్తున్న దృశ్యం, కలుషిత నీటిని చూపుతున్న మహిళ

మహిళలకు అండగా 'అభయ'

ఏలూరు టౌన్: అభయ పోలీస్ మహిళా రక్షక దళంపై ప్రజలకు అవగాహన కల్పించే లక్ష్యంతో అభయ ప్రచార రథాన్ని ఏలూరు అమీనాపేట సురేష్ చంద్ర బహుగుణ ఇంగ్లిష్‌మీడియం స్కూల్ వద్ద విద్యార్థులతో కలిసి ఎస్పీ శివకిషోర్, జాయింట్ కలెక్టర్ ధాత్రిరెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. ముఖ్యఅతిథిగా హాజరైన జేసీ ధాత్రిరెడ్డి మాట్లాడుతూ ఆపద సమయంలో మహిళలకు రక్షణ కల్పించే లక్ష్యంతో ఎస్పీ శివకిషోర్ అభయ టీమ్‌ను ఏర్పాటు చేయడం అభినందనీయమని అన్నారు. ఆపద సమయంలో జిల్లాలోని మహిళలు టోల్‌ఫ్రీ నెంబర్లు 112 లేదా 1098 లేదా 1930కు సమాచారం ఇవ్వాలని, వెంటనే పోలీస్ సిబ్బంది మీకు అండగా నిలబడతారన్నారు. ఎస్పీ శివకిషోర్ మాట్లాడుతూ మారుమూల గ్రామాల్లో సైతం ఏదైనా అసాంఘిక కార్యకలాపాలు జరిగితే వెంటనే సమాచారం ఇవ్వాలని కోరారు. అదనపు ఎస్పీ నక్కా సూర్యచంద్రరావు, మహిళా పోలీస్‌స్టేషన్ సీఐ ఎం.సుబ్బారావు, ఎస్సై క్రాంతిప్రియ, ఆర్ఎస్సై నరేంద్ర ఉన్నారు.


ప్రచార వాహనాన్ని ప్రారంభిస్తున్న ఎస్పీ శివకిషోర్, జేసీ ధాత్రిరెడ్డి

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

తణుకు అర్బన్: పట్టణంలో సజ్జాపురం, తణుకు సబ్ స్టేషన్ పరిధిలోని విద్యుత్ లైన్స్ మరమ్మతుల్లో భాగంగా శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయబడుతుందని విద్యుత్ శాఖ డివిజినల్ ఇంజనీరు కె.నరసింహమూర్తి తెలిపారు. పట్టణ పరిధిలోని రామకృష్ణ మఠం, సజ్జాపురం, ఆపిల్ హాస్పటల్ ప్రాంతాలతోపాటు భాష్యం స్కూలు నుంచి గ్రాండ్ గోస్తనీ ఏరియా వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు. కావున వినియోగదారులు సహకరించాలని కోరారు.

మద్యం విక్రయదారుడి అరెస్టు

తణుకు అర్బన్: మండలంలో నిబంధనలకు విరుద్ధంగా మద్యం విక్రయిస్తున్న దుకాణదారుడు కొప్పన దుర్గాప్రసాద్‌ను అరెస్టు చేసి 3 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నట్లు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ సత్తి మణికంఠరెడ్డి తెలిపారు. తణుకు మండలంలో గురువారం నిర్వహించిన దాడుల్లో భాగంగా మండపాక గ్రామంలోని కిళ్లీ దుకాణంలో బహిరంగంగా మద్యం సేవిస్తున్నందుకు ఈ చర్యలు తీసుకున్నట్లు చెప్పారు. అనుమతులు లేకుండా దుకాణాల్లో మద్యం సేవించేందుకు అనుమతించిన వ్యక్తులపై చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. ఎస్ఐ ఆర్ మధుబాబు, సిబ్బంది అప్పలస్వామి పాల్గొన్నారు.

తళుక్కుమంటున్న తణుకు

- వాణిజ్యంలో ప్రథమం
- పారిశ్రామికంగా ఎదిగిన ప్రాంతం
- విద్య, వైద్యానికి ప్రధాన కేంద్రం

తణుకు అర్బన్: వ్యాపార వాణిజ్యపరంగా దినదినాభివృద్ధి చెందుతున్న తణుకు ప్రాంతమంటే ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలోనే ప్రశాంతకరమైన పట్టణంగా ప్రసిద్ధి చెందింది. పచ్చటి పైరుతో పరిశుభ్రతకు మారుపేరుగా ఉండే తణుకులో స్థిరపడడానికి దూర ప్రాంతాల నుంచి సైతం వలసలు వస్తుంటారు. అంతేకాకుండా పట్టణ ప్రాంతంలో రియల్ ఎస్టేట్ వ్యాపారం



తణుకు పట్టణం వ్యూ

విస్తరించి భారీ లేఅవుట్‌లు వేయడంతో చుట్టుపక్కల గ్రామాల నుంచి తణుకులో నివాసాలు ఏర్పరచుకుని సెటిల్ అవ్వాలనే భావనలో ప్రజానీకం ఉంటారు. దీంతో తణుకు జనాభా కూడా గణనీయంగా పెరుగుతోంది.

పరిశ్రమలకు పెట్టింది పేరు..

ఆంధ్రా సుగర్స్ పేరుతో చెరకు పరిశ్రమ ద్వారా చెరకు ఉత్పత్తితో పంచదార తయారు చేయడమే కాకుండా రాకెట్ ఇంధనాన్ని సైతం ఇక్కడి నుంచే ఎగుమతి అవుతుందంటే తణుకు ఖ్యాతి ఎంతమేరకు విస్తరించి ఉందో తెలుస్తోంది. ఇండియన్ హెయిర్ ఇండస్ట్రీ ప్రైవేట్ లిమిటెడ్, గౌతమి ఆయిల్ సాల్వెంట్ పేరుతో ఆయిల్ ఉత్పత్తి, స్పిన్నింగ్ మిల్లులు, పేపరు మిల్లులు వంటి పరిశ్రమలతో వేలాది మందికి ఉపాధి దొరికే ప్రాంతంగా తణుకు గుర్తింపు పొందింది.

అపజయాలను విజయానికి మెట్లుగా మలుచుకోవాలి

తాడేపల్లిగూడెం రూరల్: జీవితంలో ఎదురయ్యే అపజయాలను విజయానికి మెట్లుగా మలుచుకోవాలని జిల్లా కలెక్టర్ సి.నాగరాణి అన్నారు. గురువారం రాత్రి మండలంలోని పెదతాడేపల్లి భారతీయ విద్యాభవన్స్ 40వ వార్షికోత్సవం నిర్వహించారు. ఈసందర్భంగా జరిగిన సభలో కలెక్టర్ నాగరాణి పాల్గొని మాట్లాడుతూ విద్య దేశ భవిష్యత్ వంటిదన్నారు. విద్యార్థులు భవిష్యత్ నిర్మాతలని పేర్కొన్నారు. కలలు, కష్టపడే తత్వమే విద్యార్థులను విజయాల వైపు నడిపిస్తుందన్నారు. భవన్స్ సంస్థ ఇంతటి విజయానికి సహకరిస్తున్న తల్లిదండ్రులు, ఉపాధ్యాయ బృందానికి అభినందనలు తెలిపారు. ప్రతి విద్యార్థి తమ కలలను సాకారం చేసుకోవాలన్నారు. అనంతరం చిన్నారుల సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి. ఆర్డీవో ఖతీబ్ కౌసర్ బనో, తహసీల్దార్ సునీల్‌కుమార్, ఎంపీడీవో ఎం.విశ్వనాథ్, భారతీయ విద్యాభవన్స్ చైర్మన్ యుకే. విశ్వనాథరాజు, వైస్ చైర్మన్లు బీహెచ్. అచ్యుత రామరాజు, త్రిలోకనాథరాజు, నాగేంద్రప్రసాద్, సెక్రటరీ, కరస్పాండెంట్ ఎస్.శ్రీరామరాజు, అసోసియేట్ సెక్రటరీ పి.సత్యనారాయణ, కోశాధికారి సురేష్‌బాబు, ప్రిన్సిపల్ రాజీవ్‌కుమార్ శర్మ, హెచ్ఎం శివగామి సుందరి, పాలకవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాల్లో తనిఖీలు

అత్తిలి: మండలంలో వరిఘేడు, తిరుపతిపురం గ్రామాలలో సహకార సంఘాల ఎరువుల గొడౌన్‌లను మండల వ్యవసాయశాఖ అధికారి టీకే రాజేష్ గురువారం తనిఖీ చేసారు. మండలంలో అన్ని ఎరువుల దుకాణాలలో ఎరువులు సమృద్ధిగా ఉన్నాయన్నారు. ఎరువుల డీలర్లు ఎరువుల అమ్మకాలు ఎప్పటికప్పుడు ఈపోస్ మెషిన్‌లో నమోదు చేయాలని తెలిపారు.

పేదలకు దుప్పట్ల పంపిణీ

తణుకు అర్బన్: పట్టణంలో శ్రీవసుంధర ఆడియో అండ్ వీడియో టెక్నీషియన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వృద్ధులు, పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. గురువారం రాత్రి బస్టాండ్, రైల్వేస్టేషన్, ఆర్వోబీపై తలదాచుకున్న వృద్ధులకు ఈ సాయం అందజేసినట్లు అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు గుడాల శ్రీనివాస్, యర్రంశెట్టి కిషోర్ చెప్పారు. ప్రతి ఏడాది శీతాకాలంలో ఈ సేవా కార్యక్రమం నిర్వహిస్తామని వివరించారు. ఈ కార్యక్రమంలో గౌరవ అధ్యక్షుడు యర్రంశెట్టి గంగాధరరావు, కోశాధికారి చంటి, సభ్యులు ఏసు పాల్గొన్నారు.

ఘనంగా వాకర్స్ కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవం

తాడేపల్లిగూడెం (టీటీసీ): ఎయిర్‌స్ట్రిప్ వాకర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారత్సోవం పట్టణంలో గురువారం వాకర్స్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఇంటర్నేషనల్ జిల్లా గవర్నర్ గుంటూరి రామరాజు ముఖ్య అతిధిగా హాజరైయారు. నూతన కార్యవర్గ అధ్యక్షుడిగా తిరుమళ్ల సూరిబాబు, సెక్రటరీగా అల్లూరి శ్రీనివాస్, కోశాధికారిగా మల్లారెడ్డి సారధి, ఇతర కార్యవర్గ సభ్యులు ప్రమాణ స్వీకారోత్సవం చేశారు. వక్తలు మాట్లాడుతూ అసోసియేషన్ మరిన్న సేవా కార్యక్రమాలతో ముందుకు సాగాలన్నారు. డాక్టర్ కంచర్ల లక్ష్మీనరసింహం, వ్యవస్థాపక అధ్యక్షుడు కూచిపూడి వెంకట కృష్ణారావు, బీఐ రాజేంద్ర, కె.నరసింహమూర్తి, రాగిరెడ్డి ప్రసాద్, ప్రవా శ్రీనివాస్ పాల్గొన్నారు.

కోడి పందేలు, జూద క్రీడలు నిర్వహిస్తే కఠినచర్యలు

తణుకు అర్బన్: సంక్రాంతి పండుగ నేపథ్యంలో కోడి పందేలు, గుండాట వంటి జూద క్రీడలు నిర్వహిస్తే కఠినచర్యలు తీసుకుంటామని తహసీల్దార్ డీవీఎస్ఎస్ అశోక్‌వర్మ అన్నారు. హైకోర్టు జూద క్రీడలపై నిషేద ఆజ్ఞలు విధించిన పరిస్థితుల్లో గురువారం తణుకు తహసీల్దార్ కార్యాలయంలో పోలీసు, రెవెన్యూ, సచివాలయ సిబ్బందికి నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. సంక్రాంతి పండుగను బంధువులు, కుటుంబసభ్యులతో ఆనందంగా నిర్వహించుకోవాలని కోరారు. కోడి పందేలు, జూద క్రీడలకు పాల్పడితే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సమావేశంలో తణుకు పట్టణ, రూరల్ పోలీసు అధికారులు, రెవెన్యూ అధికారులు, సచివాలయ సెక్రటరీలు పాల్గొన్నారు.

కోడి పందేలు నిర్వహిస్తే కఠిన చర్యలు

అత్తిలి: సంక్రాంతి సందర్భంగా మండలంలో కోడిపందేలు వంటి చట్టవ్యతిరేక కార్యకలాపాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ దశిక వంశీ హెచ్చరించారు. కోడిపందేలకు స్థలాలు ఇచ్చినా, కత్తులు సమకూర్చినా, బరులు ఏర్పాటు చేసినా, పేకాట, గుండాట, కోతాట, అక్రమ మద్యం విక్రయించినా చర్యలు తప్పవన్నారు. కోడిపందేలు నిరోధం కోసం మండల, గ్రామ స్థాయిలో కమిటీలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఎక్కడైనా కోడిపందేలు నిర్వహిస్తే సమాచారం పంచాయతీ కార్యదర్శికి, వీఆర్వోలకి, పోలీసులకు తెలియజేయాలన్నారు.

డీఆర్‌జీ ప్లేస్‌మెంట్ డ్రైవ్‌లో 36 మందికి ఉద్యోగాలు

పెంటపాడు: మండలంలోని డీఆర్ గోయంకా ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రాంగణ ఎంపికలలో 36 మంది ఉద్యోగాలు పొందినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ, నేషనల్ కెరీర్ సర్వీస్, ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ఎంపికలలో ముత్తూట్ ఫైనాన్స్, టీమ్ లీజ్ కంపెనీలకు చెందిన ప్రతినిధులు ఇంటర్వ్యూలు నిర్వహించారు. పలు ప్రాంతాలకు చెందిన భారీ సంఖ్యలో నిరుద్యోగులు ఈ ఇంటర్వ్యూలలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆంగ్ల అధ్యాపకురాలు ఎం. ఇందిరమ్మ, జేకేసీ ప్రతినిధి సుజాత, కళాశాల అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

సామాజిక పింఛన్ల తనిఖీ

ఇరగవరం: సామాజిక పింఛన్ల తనిఖీలో భాగంగా గురువారం ఇరగవరం మండలం కె.ఇల్లింద్రపర్రు, సూరంపూడి, తూర్పు విప్పర్రు, కె.కుముదవల్లి గ్రామాల్లో మంచానికే పరిమితమైన పెన్షనర్లను అధికార బృందం తనిఖీ చేసింది. ఈ తనిఖీలో స్టేట్‌టీం ఎం డాక్టర్ జాన్ హరీషణ్, జిల్లా టీఎం డాక్టర్ సుష్మా, డాక్టర్ క్రాంతి రెడ్డి, ఎంపీడీఓ శ్రీనివాస్ పాల్గొన్నారు.

బీమా చేయించుకోవాలి

పెంటపాడు: రైతుల కోసం ప్రధానమంత్రి ఫసలీ బీమా గడువును ఈనెల 15 వరకు పెంచినట్లు మండల వ్యవసాయాధికారి కె. పార్ధసారథి పేర్కొన్నారు. ప్రతి రైతు పంటకు ప్రధానమంత్రి ఫసల్ బీమా చేయించుకుని ధీమాగా ఉండాలన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.